

రోగులకు పండ్లు పంపిణీ

సిర్పూర్(టి), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జాతీయ పత్రికాదినోత్సవంను పురస్కరించుకుని శనివారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు సిర్పూర్(టి) ప్రెస్‌క్లబ్ అధ్వర్యంలో జర్నలిస్టులు పాలు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు సంతోష్, జమీల్, నాజీర్ అలీ, రాజాగౌడ్, ధనుంజయ్, ప్రసాద్‌గౌడ్, డాక్టర్ జోగేందర్, డాక్టర్ నాగరాజు, హెడ్‌నర్సు షబానా తబసుం, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రూపు-3 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లాలో 18పరీక్షా కేంద్రాలు
- హాజరుకానున్న 4471మంది అభ్యర్థులు



పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆది, సోమవారాల్లో నిర్వహించే గ్రూపు-3పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆసిఫాబాద్ జిల్లాకేంద్రంలో9, కాగజ్‌నగర్‌పట్టణంలో9 మొత్తం 18పరీక్షాకేంద్రాలను ఏర్పాటుచేశారు. ఆసిఫాబాద్‌లో 2304మంది, కాగజ్‌నగర్‌లో 2167 మంది మొత్తం 4471మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారు. 58మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు 100మందికి పైగా ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 163 సెక్షన్ విధించారు. పరీక్షాకేంద్రాలవద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటుచేశారు. పరీక్షా కేంద్రాలను ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పరిశీలించి పోలీసు అధికారులకు పలు సూచనలను, సలహాలను అందిం చారు. అంతకుముందు జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. అభ్యర్థులు రెండు గంటల ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, 9.30గంటలకు పరీక్షాకేంద్రం గేట్లు మూసి వేస్తామన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను అనుమతించమ న్నారు. సమావేశంలో ఏఎస్పీ ప్రభాకర్ రావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

నేడు రావుల మల్లన్న బోనాల జాతర

దహెగాం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని రావుల మల్లన్న ఆలయం వద్ద ఆదివారం బోనాల జాతర నిర్వహించనున్నట్లు యాదవకమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది కార్తీకపౌర్ణమి తరువాత వచ్చే ఆదివారం రోజున బోనాల జాతర నిర్వహిస్తారు. ఈ బోనాలకు కాగజ్‌నగర్, భీమిని, పెంచికలపేట, కన్నెపల్లి గ్రామాల ప్రజలు తరలిస్తారు.



బెజ్జూరులోని పశువైద్యశాల

పశువులకేది బీమా?

- ఆరేళ్లుగా నిలిచిన పథకం
- నష్టపోతున్న పశు పోషకులు
- పట్టించుకోని అధికారులు

బెజ్జూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమంతోపాటు పాడిపరిశ్రమ అభివృద్ధికి తగిన ప్రాధాన్యం ఇస్తామన్న ప్రభుత్వ మాటలు నీటి మూటలుగానే మారుతున్నాయి. పాడిపరిశ్రమను ఆధారంగా చేసుకొని ఎన్నో కుటుంబాలు జీవిస్తున్నా పాడి పశువుల సంరక్షణపై మాత్రం ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. ముఖ్యంగా లక్షలాది రూపాయలు పెట్టి పశువులను కొనుగోలు చేస్తున్నప్పటికీ వాటికి బీమా సౌకర్యం కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. జిల్లాలో బీమా అమలు కాకపోవడంతో పశుపోషకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో వ్యవసాయం తరువాత రైతులు ఎక్కువగా పాడిపరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటును అందించే వ్యవసాయ అనుబంధరంగాలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. రైతులు వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమను కొనసాగిస్తే ఆర్థికంగా ఆసరా ఉంటుంది. ప్రభుత్వం చేయూతను అందిస్తామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడంలేదు. ఆరేళ్లుగా పశువుల బీమా పథకం నిలిపివేయడంతో పశుపోషకులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. పాడి పశువులు అనారోగ్యం, ఇతర కారణాలతో మృత్యువాత పడుతుం డటంతో వారు ఆర్థికంగా నష్టపోతున్నారు.

మేలు జాతి పశువులకు లక్షల్లో డిమాండ్..

పశుబీమా పథకాన్ని 2017,2018వరకు గత ప్రభుత్వం అమలు చేసింది. ఆరేళ్లుగా ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదు. గ్రామీణప్రాంతాల్లో పశువులు, రోడ్డు, విద్యుత్ ప్రమాదాలు, అనారోగ్యం కారణంగా చనిపోతున్నాయి. మేలు జాతి పశువులకు రూ.లక్షల్లో డిమాండ్ ఉంది. అనివార్య కారణాలతో పశువులు మృతిచెందితే రైతులు పూర్తిస్థాయిలో నష్టపోయి అప్పుల్లో కూరుకుపోతున్నారు. గతంలో బీమా కోసం యజమాని కొంత చెల్లిస్తే ప్రభుత్వం కొంత మొత్తం జమచేసేది. ఏదైనా ప్రమాదంలో జీవాలు చనిపోతే ఆయా సంస్థల నుంచి గతంలో పశువుల రకాన్ని బట్టి 50వేల రూపాయల వరకు పరిహారం అందేది. దీంతోపాటు పశువులు మృత్యువాత పడినా వచ్చిన బీమా డబ్బులతో రైతులు మళ్లీ పశువులను కొనుగోలు చేసుకొని భరోసాగా ఉండేవారు. ప్రస్తుతం ఈ పథకం నిలిచిపోవడంతో వివిధ కారణాలతో పశువులు చనిపోతే రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

బీమా పథకాన్ని పునరుద్ధరించాలి..

- కావిడే బీంరావు, రైతు, చిన్నసిద్దాపూర్



జిల్లాలో పశువులకు బీమాపథకాన్ని పునరుద్ధరించాలి. బీమా కోసం ప్రైవేటు కంపెనీలను ఆశ్రయిస్తే డబ్బులు అధికంగా ఖర్చవుతున్నాయి. ప్రైవేటుగా బీమా పథకాన్ని చేయించుకోకపోవడం వల్ల పశువులు మృత్యువాతపడితే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. ప్రభుత్వం రైతుల వాటా కలుపుకొని బీమా పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలి.

ప్రభుత్వానికి నివేదిస్తాం..

- డాక్టర్ సురేష్, జిల్లా పశువైద్యాధికారి, ఆసిఫాబాద్

ప్రభుత్వం పంపిణీ చేసిన పథకాల్లో లబ్ధిదారులు పొందిన పశువులకు యూనిట్ విలువ నుంచి బీమా సదుపాయం కల్పించింది. రైతుల వద్ద ఉన్న పశువులకు బీమా పథకం కల్పించలేదు. ప్రైవేటుగా బీమా చేసుకుంటే నష్టం జరిగినప్పుడు పరిహారం అందుతుంది. కొత్త ప్రభుత్వం బీమా పథకాన్ని అమలు చేస్తే పశువులకు బీమా సదుపాయం కల్పిస్తాం.

ఏటా జీవాల మృతి..

జిల్లావ్యాప్తంగా మొత్తం ఆవులు 2,93,845, గేదెలు 46,374, గొర్రెలు 1,59,349, మేకలు 2,56,854, పందులు 507, కుక్కలు 907, ఇతర జంతువులు ఉన్నాయి. ఏటా వందల కొద్దీ పశువులు అనారోగ్యం, పిడుగులు పడి, రోడ్డు, రైలు ప్రమాదాల కారణంగా మృతిచెందుతున్నాయి. పలుమార్లు లంపిస్కిన్ తదితర వ్యాధులు సోకి ఆవులు, ఎద్దులు మృత్యువాత పడుతున్నాయి. గత ప్రభుత్వం గొర్రెల పథకలో పంపిణీ చేసిన గొర్రెలకు మాత్రమే బీమా వర్తింపజేసేది. ప్రస్తుతం గొర్రెలు, ఎద్దులు, గేదెలకు బీమా సదుపాయం లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ప్రైవేటు బీమా కంపెనీలను ఆశ్రయించి బీమా చే యించాలనుకుంటే సుమారు 50వేల రూపాయల ప శువులకు 4వేలుఖర్చు అవుతుందని వాపోతున్నారు. ప్రభుత్వం పశుబీమా పథకాన్ని అమలుచేసి 50 శా తం ని. దులు కేటాయించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

గుస్సాడీ బృందానికి అరుదైన అవకాశం

జైనూర్, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీఅవార్డు గ్రహీత కనకరాజు తయారుచేసిన గుస్సాడి బృందానికి ఇంటర్నేషనల్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో పాల్గొనే అరుదైన అవకాశం వచ్చిందని ఆ బృందం టీంలీడర్ కనక సుదర్శన్ తెలిపారు. మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచదేశాల ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఈనెల 20నుంచి 28వరకు గోవాలో జరగనుందన్నారు. ఇందులో ఆరుదేశాలు పాల్గొంటాయన్నారు. అదేవిధంగా 9 రాష్ట్రాల కళకారులు ఇక్కడ సాంస్కృతిక ప్రదర్శలు ఇస్తాయన్నారు. ఈ ఫెస్టివల్‌లో తమ బృందం పాల్గొంటున్నందున ఎంతో సంతోషంగా ఉందని కనక సుదర్శన్ తెలిపారు. ఈఫెస్టివల్‌లో మండలం తరఫునబృందంలో కనక సుదర్శన్, కుంర సాయిరాజ్, జుగునాక సంజయ్ కుమార్, మేస్రాం లక్ష్మణ్, సోయం రమేష్, గోడం గోపాల్, ఆత్రం అర్జున్, శ్రీకాంత్, మేస్రాం నవనాథ్, ఆత్రం హన్మంతరావ్ ఉన్నారని ఆయన తెలిపారు.

రైతులకు అందుబాటులో ఉండి సేవలందిస్తా

జైనూర్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): జైనూరు మార్కెట్‌కమిటీ పరిధిలోని రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలందిస్తానని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ అన్నారు. స్థానికమార్కెట్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ మార్కెట్ పాలకవర్గం సహకారంతో తమపరిధిలోని ఉట్నూరు, లింగాపూర్, సిర్పూర్(యు) మండలాల్లో విస్తృతంగా పర్యటించి రైతుల సాధక బాధల్ని తెలుసుకుంటామన్నారు. త్వరలోనే వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించి జీరో వ్యాపారానికి అడ్డుకట్ట వేస్తామన్నారు. సమావేశంలో మార్కెట్‌కమిటీ డైరెక్టర్, మాజీ సర్పంచ్ పంద్రషేకురైతులు పాల్గొన్నారు.

తుడుందెబ్బ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆదివాసీహక్కుల పోరాటసమితి, తుడుందెబ్బ ఉమ్మడిజిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కోకన్వీనర్ కోట్నాక విజయ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20న ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులోని ఆదివాసీభవన్‌లో నిర్వహించే మహాసభలకు ఆదివాసీ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోవ విజయ్‌కుమార్, మారుతి, రాంషా, భగవంతరావు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులు, నిర్బంధాలను అరికట్టాలి

ఆసిఫాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులపై పెరుగుతున్న దాడులు, నిర్బంధాలను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణచట్టం తీసుకురావాలని టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షుడు రహెమాన్ అన్నారు. శనివారం జాతీయపత్రికా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు ప్రకాష్‌గౌడ్, హరికృష్ణ, సురేష్, శ్రీధర్, శ్రీనివాస్, రాధాకృష్ణచారి, మిలింద్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

కాగజ్‌నగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం కాగజ్‌నగర్ మండలం సీతానగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపుకలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టార్పాలిన్ కవర్లు, గన్ని సంచులు అందుబాటులో ఉంచాలన్నారు. నిబంధనల మేరకు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తెలిపారు. సన్నరకంకు మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. సన్నరకం ధాన్యం అధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం కాగజ్‌నగర్ పట్టణంలో ఆది, సోమవారాల్లో నిర్వహించనున్న గ్రూపు-3 పరీక్షా కేంద్రాలను తనిఖీచేశారు. పట్టణంలోని ఫాతీమా కాన్వెంట్ పరీక్షాకేంద్రాన్ని సందర్శించి గదులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్షగదుల్లో ఫర్నీచర్, ఫ్యాన్లు, వెలుతురు సరిగ్గా ఉండేలా చూసుకోవాలని చీఫ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. అనంతరం కాగజ్‌నగర్ మున్సిపల్ పరిధిలోని ఈద్గాకాలనీలో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన బ్లాక్‌లలో ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ వివరాలను నిర్ణీత నమూనాలలో స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. ఆయనవెంట జిల్లా సహకార అధికారి రబ్బాని, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మనోహర్, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, తహసీల్దార్ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



కేజీబీవీలో కూరగాయలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

పెంచికలపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని అదనపుకలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శనివారం మండలంలోని గుంట్లపేట, ఎల్కపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దలారులను నమ్మి మోసపోకుండా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఏగ్రేడ్ రకానికి రూ.2320, సాధారణ రకానికి రూ.2300అదే విధంగా సన్నరకంకు అదనంగా రూ.500చెల్లించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. ధాన్యం విక్రయించిన రైతుల వివరాలు ట్యాబ్‌లో వెంటనే నమోదు చేయాలని సూచించారు. తేమ శాతం 17 కంటే తక్కువ ఉన్న ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల హాజరుశాతం తక్కువగా ఉండడానికి కారణమేమిటని ఎస్‌వో కవితను అడిగి తెలుసుకున్నారు. అనారోగ్య కారణాల వల్ల ఇళ్లలోకి వెళ్లారని ఆమె బదులిచ్చారు.

వంటగది, డైనింగ్ హాల్, స్టోర్ రూంలను పరిశీలించారు. స్టోర్‌రూంలో కొన్ని కూరగాయలు చెడిపోయి ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెనూప్రకారం భోజనం అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎస్సై కొమురయ్య, ఆర్ఐ గోపాల్, తదితరులు న్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

పెంచికలపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో పార్టీ బలోపేతానికి కృషిచేయాలని ఆ పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపునకు కృషి చేయాలన్నారు. మండలంలో సభ్యత్వ నమోదు సంతృప్తికరంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ప్రభాకర్‌గౌడ్, నాయకులు భుజంగరావు, సంతోష్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

పెంచికలపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్కపల్లి గ్రామానికి చెందిన తెలిగే తిరుపతి తల్లి ఇటీవల మరణించగా కాంగ్రెస్ నాయ కుడుకృష్ణ బాధితకుటుంబాన్ని శనివారం పరామర్శించి మూడువేల ఆర్థికసాయం అందజేశారు. ఆయనవెంట మాజీ సర్పంచ్ చంద్రమౌళి, శంకర్‌గౌడ్ ఉన్నారు.

మూడు నాలుకలతో జన్మించిన దూడ

బెజ్జూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో మూడు నాలుకలతో దూడ జన్మించింది. మండల కేంద్రానికి చెందిన మేకల పర్వతాలు గేదె శనివారం ఈనింది. పుట్టిన దూడకు మూడు నాలుకలు ఉన్నాయి. దూడను ప్రజలంతా ఆశ్చర్యంగా చూస్తున్నారు. జన్యు లోపం కారణంగా కొన్ని సార్లు దూడలు వింతగా పుడతాయని పశువైద్యాధికారి డాక్టర్ రాకేష్ పేర్కొన్నారు. ఇలా జన్మించిన దూడలు ఎక్కువ కాలం బతకవని ఆయన పేర్కొన్నారు.



మూడు నాలుకలతో దూడ

గిరిజన గ్రామాల్లో జనజాతీయ గ్రామసభలు



పాములవాడలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సిర్పూర్(యు), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయాగిరిజన గ్రామాల్లో శనివారం జనజాతీయ గ్రామఅభియాన్ గ్రామసభలు నిర్వహించారు. మండలంలోని పాములవాడలో అధికారులు మాట్లాడుతూ రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ పథకం కింద భగవాన్ బిర్సా ముండా 150వజయంతి ఈనెల 15న ప్రధానిమోదీ గిరిజనసంక్షేమం కోసం పథకాలు ప్రారంభించారన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు ఏర్పాటు చేసి పెసా చట్టంతోపాటు ఫారెస్ట్‌రైట్ యాక్ట్‌లపై అవ గాహన కార్యక్రమం నిర్వహించారు. వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహగాం మండాడి గాగ్రు, పంచాయతీ కార్యదర్శి సోయం దేవ్‌రావు, ఉపాధ్యాయులు గెడం జగ్జీవన్, మంజుల, అంగన్‌వాడీ టీకబాయి, గ్రామస్థులు కుడ్మెత బాగుబాయి, సోయం చిత్రు, సోయం శంకర్, ఆత్రం బీర్షా తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు



ఆలయంలో డాక్టర్ శ్రీనివాస్

కాగజ్‌నగర్, నవంబరు 16: మహారాష్ట్ర చంద్రాపూర్ మహంకాళి ఆలయాన్ని శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. ఆయనతో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, తదిదతరులున్నారు.

బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్సీ



మురళీగౌడ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్

కాగజ్‌నగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్‌పార్టీ నాయకుడు మురళీగౌడ్‌ను శనివారం ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ పరామర్శించారు. గుండెపోటు రావటంతో మురళీగౌడ్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ సందర్భంగా నిమ్స్ ఆసుపత్రి డాక్టర్లతో ఎమ్మెల్సీ మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వాంకిడి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందాని గ్రామంలో శుక్రవారం చాప్లె ప్రకాష్‌కు చెందిన ఇల్లు అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకుడు ప్రశాంత్ శనివారం పరామర్శించారు. స్థానిక గిర్దావర్‌తో నష్టం అంచనా వేయించి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామన్నారు.

సమగ్ర సర్వేను పరిశీలించిన అధికారులు



వాంకిడిలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

వాంకిడి/సిర్పూర్(టి), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలాల్లో కొనసాగుతున్న సర్వేను ఎంపీడీవోలు ప్రవీణ్‌కుమార్, సత్యనారాయణ ఎంఈవో శివచరణ్ పరిశీలించారు. సర్వేలో వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. ఒక్కఇల్లు కూడా తప్పిపోకుండా సర్వేచేపట్టాలని ఎన్యూమరేటర్లను ఆదేశించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

తిర్యాణి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మొర్రిగూడ గ్రామానికి చెందిన కోర్పెత తిరుమల్‌రావు(42) శనివారం మృతిచెందాడు. తిరుమల్‌రావు శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన వారసంతకు వచ్చి తిరిగి ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో సమ్మక్కగద్దెల సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అతన్ని 108లో ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై మాధవ్‌గౌడ్ తెలిపారు.

ఎద్దు దాడిలో ఇద్దరికి గాయాలు

బెల్లంపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బజార్ఏరియాలో శనివారం ఎద్దు దాడి చేయడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. దుర్గయ్య అనే వ్యక్తి వస్తువులు కొనడానికి వచ్చిన సమయంలో ఎద్దు దాడి చేసింది. అలాగే కాంట్రాక్టు కార్మికురాలైన లక్ష్మమ్మపై ఎద్దు దాడి చేయడంతో చేతులకు గాయాలయ్యాయి. గాయాలైన వారిని వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో పశువులు మృతి

మందమర్రిరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సారంగపల్లి పంచాయతీలోని దుబ్బపల్లి గ్రామానికి చెందిన ఇందూరి శంకర్‌కు చెందిన రెండు ఎద్దులు విద్యుదాఘాతంతో మృతిచెందాయి. బుధవారం మేత కోసం అటవీ ప్రాంతానికి వెళ్లి ఇంటికి రాకపోవడంతో వెతుకుతుండగా దుబ్బపల్లి ప్రాంతంలో చనిపోయి కనిపించినట్లు శంకర్ తెలిపారు. వన్యప్రాణుల కోసం అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి మృతిచెందాయని బాధితుడు శంకర్ తెలిపారు. వీటి విలువ సుమారు రూ.2.20 లక్షలు ఉంటుందని నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు శంకర్ వేడుకున్నాడు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య


జగదీష్(ఫైల్)

తిమ్మాపూర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ, కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దండేపల్లి మండలం తాళ్లపేట గ్రామానికి చెందిన దామనపల్లి జగదీష్ (34) కొంత కాలంగా కరీంనగర్‌లోని సీతారాంపూర్‌లో ఆటో నడుపుకుంటు జీవిస్తున్నాడు. కుటుంబ అవసరాల నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ బ్యాంకులో పర్సనల్ లోన్ తీసుకున్నాడు. వాయిదాలు చెల్లించకపోవడంతో అధికారులు డబ్బులు కట్టాలని డిమాండ్ చేస్తున్నారు. జగదీష్‌కు రెండేళ్ల క్రితమే వివాహం జరగగా భార్యతో గొడవలు జరుగుతున్నాయి. ఓ వైపు లోన్ కట్టాలని, మరో వైపు భార్య నుంచి వేధింపులు ఎక్కువ కావడంతో ఈనెల 13న జగదీష్ ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. శనివారం అలుగునూర్ శివారులోని కాకతీయ కాలువ సమీపంలో చెట్ల పొదల్లో చెట్టుకు ఉరివేసుకున్న జగదీష్ మృతదేహం కనిపించింది. లోన్ కోసం బ్యాంకు అధికారి, భార్య వేధింపులు తట్టుకోలేకనే ఆత్మహత్యకు పాల్పడినట్లు సూసైడ్ నోట్ లభించిందని, జగదీష్ సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

స్క్రాప్ చోరీకి విఫలయత్నం

మంచిర్యాల అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎంసీసీ కంపెనీకి చెందిన స్క్రాప్ చోరీకి యత్నించారని కంపెనీ సెక్యూరిటీ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి క్వారీ ప్రాంతం వైపు ఎంసీసీ కంపెనీకి చెందిన సుమారు ఒక టన్ను బరువు ఉన్న స్క్రాప్‌ను గుర్తు తెలియని వ్యక్తులు వాహనంలో లోడ్ చేసుకొని ర్యాలీగడ్‌పూర్ వైపు వెళ్తుండగా పెట్రోలింగ్ డ్యూటీలో ఉన్న కంపెనీ సెక్యూరిటీ సిబ్బంది వాహనాన్ని ఆపి ప్రశ్నిస్తుండగా పరారయ్యారని తెలిపారు. వాహనాన్ని పరిశీలించగా స్క్రాప్ కనిపించడంతో వాహనాన్ని అప్పగించి ఫిర్యాదు చేశారని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

వెజ్ బిర్యానీలో బొద్దింక



మంచిర్యాల అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల ఓ హోటల్‌లో వెజ్ బిర్యానీలో బొద్దింక వచ్చిందని శనివారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఓ కస్టమర్ వెజ్ బిర్యానీ ఆర్డర్ చేయగా సగం వరకు తిన్న కస్టమర్ బిర్యానీలో బొద్దింక ఉందని హోటల్ నిర్వాహకులతో వాగ్వాదానికి దిగాడు. కావాలనే బొద్దింకను అందులో వేసి గొడవ చేస్తున్నావని హోటల్ నిర్వాహకులు గొడవకు దిగినట్లు సమాచారం. హోటల్ నిర్వాహకులను ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించగా వారు అందుబాటులోకి రాలేదు.

పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి


పెద్ద భీమయ్య (ఫైల్)

దండేపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలో ఉన్న పొలాన్ని కాపాడుకునేందుకు చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశాడు రాజుగూడ గ్రామ పంచాయతీ శివారు కుంటలగూటకట్లకు చెందిన కౌలు రైతు మారినేని పెద్ద భీమయ్య(49). వరి చివరి దశలో ఉండడంతో నీరు పెట్టేందుకు శనివారం ఉదయం 5 గంటల ప్రాంతంలో వెళ్లాడు. పొలానికి ఏర్పాటు చేసిన వైర్లకు తగిలి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయం వెళ్లిన భీమయ్య మధ్యాహ్నం అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెళ్లి చూడగా పొలం వద్ద మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ వెల్లడించారు.

గ్రామస్థులందరూ కలిసిమెలిసి ఉండాలి


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ సుధాకర్

వేమనపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు సత్ప్రవర్తనతో జీవించాలని చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్ పేర్కొన్నారు. శనివారం బుయ్యారం గ్రామంలో కార్డెన్‌సర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని ద్విచక్రవాహనాలకు జరిమానాలు విధించారు. సీఐ మాట్లాడుతూ గ్రామంలో తరుచూ గొడవలు జరుగుతున్నాయని, ఒకరి మీద ఒకరు తప్పుడు కేసులు పెడుతూ సమయాన్ని వృథా చేసుకుంటున్నారన్నారు. తప్పుడు కేసులను ప్రోత్సహించే వారిపై పీడీయాక్టు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామంలో గుడుంబా తయారీ అవుతుందని దీన్ని మానుకోవాలని హెచ్చరించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్, పోలీసులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ అందజేత

నస్పూర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆర్‌కే 5 కాలనీ జామే మజీద్‌లో శనివారం మజీద్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ మౌలానా ఆధ్వర్యంలో కుట్టు మిషన్ అందించారు. బీహార్ రాష్ట్రానికి చెందిన హఫీజ్ అతార్ 20 ఏళ్ల క్రితం బతుకుదెరువు కోసం నస్పూర్‌కు వచ్చాడు. టైలరింగ్ షాపు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నాడు. ఇటీవల అతని షాపులో అగ్ని ప్రమాదం జరిగి కుట్టుమిషన్, దుస్తులు కాలిపోయాయి. మౌలానా ఆధ్వర్యంలో రూ.25 వేల విలువ గల కుట్టుమిషన్‌ను బాధితుడికి శనివారం అందించారు.

కళాశాల ఆవరణలో పిచ్చి మొక్కలు

జైపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అపరిశుభ్రతకు నిలయంగా మారింది. తరగతి గదులను ఆనుకుని పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. పాముల సంచారంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఆట స్థలంలో కూడా పిచ్చి మొక్కలు పెరగడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కళాశాల చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడంతో మందు బాబులకు అడ్డాగా మారిందని విద్యార్థులు వాపోతున్నారు. కళాశాల ఆవరణలో పిచ్చి మొక్కలు అపరిశుభ్రంగా ఉన్నా ప్రిన్సిపాల్ అధ్యాపకులు పట్టించుకోవడం లేదని విద్యార్థులు తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. పిచ్చి మొక్కలు, చెత్తా, చెదారం తొలగించాలని కోరుతున్నారు.



కెరమెరి ఘాట్ రోడ్డుపై ఉన్న మూల మలుపులు

ఆకట్టుకుంటున్న కెరమెరి ఘాట్స్




కెరమెరి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కెరమెరి ఘాట్ అందాలు ప్రయాణికులను ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. 18 మూల మలుపులు, వంకలు తిరిగిన రోడ్డు ఇక్కడ ప్రత్యేకత. ఆసిఫాబాద్-ఉట్నూర్- ఆదిలాబాద్ వెళ్లే ప్రయాణికులు ఈ ఘాట్ రోడ్డు నుంచి ప్రయాణించాల్సి ఉంటుంది. అనునిత్యం బస్సులలో, ఇతర ప్రైవేటు వాహనాలలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు. కెరమెరి నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఘాట్ రోడ్డు మొదలవుతుంది. సుమారు 9కిలోమీటర్ల మేర ఎత్తైన కొండలు, సహ్యాద్రి పర్వత శ్రేణుల్లో ప్రయాణం కనువిందు చేస్తుంది. ఘాట్ రోడ్డుపై ఉన్న జలాశయం ప్రయాణికులకు కనువిందు చేస్తుంది. ఈ ఘాట్ రోడ్డు నైజాం రాజులు పాలించిన రోజుల్లో నిర్మించినట్లు స్థానికులు చెబుతున్నారు.

వృద్ధాశ్రమానికి విద్యుత్ ఉద్యోగుల విరాళం

రెబ్బెన, నవంబరు 16: ఆసిఫాబాద్ జిల్లా విద్యుత్ ఉద్యోగులు శనివారం రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్‌లోని న్యూలైఫ్‌ఇన్‌బో వృద్ధాశ్రమానికి రూ.20వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆర్ శేషరావు మాట్లాడుతూ టీజీఎన్పీడీసీఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉద్యోగుల వెల్ఫేర్‌ట్రస్టు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రతినెలజీతాల ద్వారా చిన్న మొత్తంలో విరాళాలు సేకరిస్తున్నట్టు తెలిపారు. సేకరించిన మొత్తాన్ని అనాథాశ్రమాలకు, వృద్ధాశ్రమాలకు, స్వచ్ఛంద సంస్థలకు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏవో దేవిదాస్, డీఈ జీవరత్నం, ఫెరోజ్ ఖాన్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

సంవిధాన్ దివస్ పోస్టర్ల విడుదల

ఆసిఫాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం సమతభారత్ ఐక్యవేదిక ఆధ్వర్యంలో సంవిధాన్ దివస్ పోస్టర్లను ఆయా సంఘాల నాయకులు విడుదల చేశారు. ఈసందర్భంగా భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ ఈనెల 24న పట్టణంలోని లుంబినీ దీక్షాభూమిలో భారతరాజ్యాంగ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, కార్యక్రమానికి పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు వినేష్, ఆత్మారాం, హోక్బ, తుకారాం, కృష్ణాజీ, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే


బెజ్జూరులో బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

బెజ్జూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన ముగ్గురు యువకులు మోయిజ్, ఇర్షాద్, జాహీర్‌అలీ ఇటీవల ప్రాణహితనదిలో గల్లంతై మృత్యువాతపడగా శనివారం మాజీఎమ్మెల్యే కోనేరుకోనప్ప బాధితకుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంటనాయకులు వెంకన్న, బషరత్‌ఖాన్, అమీరుద్దీన్, సకారాం, నరేందర్‌గౌడ్, జాహీద్ హుస్సేన్, శ్రీనివాస్, వెంకన్న, ఇస్తారి, రవిఉన్నారు.

పెంచికలపేట: మండలకేంద్రంలో సీనియర్‌నాయకుడు శేఖర్‌తండ్రి లస్మయ్య అనారోగ్యంతో మృతిచెందగా కుటుంబ సభ్యులను మాజీఎమ్మెల్యే కోనేరుకోనప్ప పరామర్శించారు. అలాగే ఆగర్‌గూడలో నాయకుడు సకారాం కోడలు అనూషఅనారోగ్యంతో మృతచెందగా వారి కుటుంబసభ్యులను, ఎల్లూరు సీనియర్ నాయకుడు దయాకర్‌గౌడ్ తల్లిబాయక్క అయిదు రోజులక్రితం మృతిచెందగా బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయనవెంట శ్రీనివాస్, రాజన్న, సంజీవ్, సుధాకర్, తిరుపతి, సాజిత్, ఖలీల్‌బేగ్, బాబు, తులసీరాం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్లబోరిలో పంటకోత ప్రయోగం

కౌటాల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలం లోని గుడ్లబోరి గ్రామశివారులో శనివారం వ్యవసాయాధికారి ప్రేమలత ఆధ్వర్యంలో ఏఈవోలు అంజన్న వరిపంట కోతప్రయోగం నిర్వహిచారు. ఈ సందర్భంగా 5/5మీటర్ల పరిధిలో గల పంటనుకోసి తూకంవేసి వచ్చిన ధాన్యం దిగుబడి ద్వారా ఎకరానికి ఎంత దిగుబడి వస్తుందని అంచనా వేశారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు


సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు

బెజ్జూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో శనివారం కార్తీకమాసం సందర్భంగా సత్యనారాయణ వ్రతాలను సామూహికంగా నిర్వహించారు. మండలంలోని అటవీ ప్రాంతంలోని మాణిక్యదేవర ఆలయంలో ఉసిరికచెట్టు వద్ద సామూహికవ్రతాలను నిర్వహించి కార్తీక వనభోజనాలు నిర్వహించారు. అనంతరం బెజ్జూరుకు చెందిన మిర్యాలమినీషా పెంచికలపేట వ్యవసాయాధికారిగా నియమితులు కావడంతో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.



ఐఎన్టీయూసీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా నరేందర్


నరేందర్

మందమర్రి టౌన్, నవంబర్ 16(ఆంధ్రజ్యోతి): ఐఎన్టీయూసీ యూనియన్ కేంద్రకమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఏరియాలోని కేకే5 గనిలో అసిస్టెంట్ ఫైన్‌మెన్‌గా పనిచేస్తున్న రాంశెట్టి నరేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనను నియమిస్తూ ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నరేందర్ తనపై నమ్మకంతో పదవికట్టబెట్టిన జనక్ ప్రసాద్, అధ్యక్షుడు సంజీవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఐఎన్టీయూసీ బలోపేతానికి కమిటీలు

మందమర్రి టౌన్, నవంబర్ 16(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో యూనియన్ బలోపేతానికి సంబంధించి 11ఏరియాల్లో కమిటీలను ఎంపిక చేశామని ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ బి జనక్ ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులకు పంపిన ఒకప్రకటనలో ఈ విషయాన్ని తెలిపారు. 11ఏరియాలకు సంబంధించి 130మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. సింగరేణికి ప్రభుత్వం అందిస్తున్న చేయూత మరువలేనిదని తెలిపారు. కమిటీలో ఎన్నికైన వారు కార్మికుల సమస్యల సాధనకు కృషి చేయాలని పేర్కొన్నారు.

రేపు ఆయుర్వేద వైద్య శిబిరం

శ్రీరాంపూర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈనెల 18న ఉదయం 10నుంచి 6గంటలవరకు నస్పూర్‌కాలనీలోని మనోరంజన్ సముదాయ్‌లో ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఏరియా డీజీఎం (పర్సనల్) పి అరవిందరావు ఒకప్రకటనలో తెలిపారు. డాక్టర్ విశ్వనాథమహర్షి ఆయుర్వేద వైద్యపరీక్షలు నిర్వహించి మందులు ఇస్తారని పేర్కొన్నారు. బీపీ, షుగర్, కీళ్ల నొప్పి, నడుము నొప్పి వంటి అనారోగ్య సమస్యలున్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

బీసీ మహాసభను విజయవంతం చేయండి

శ్రీరాంపూర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే సింగరేణి కాలరీస్ బీసీ సంక్షేమ సంఘం మహాసభ విజయవంతానికి కృషిచేయాలని ఆసంఘంనాయకుడు ముష్కెసమ్మయ్య పిలుపునిచ్చారు. శనివారం ఆర్కేన్యూటెక్ గనిపై నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కలిసికట్టుగా ఉంటూ హక్కుల పరిరక్షణకు బీసీలు కృషిచేయాలని సూచించారు. అనంతరం గని కన్వీనర్‌గా సిద్ధం అజయ్, కో-కన్వీనర్‌గా గుంపుల హనుమంత్ యాదవ్‌లను నియమించారు. కార్యక్రమంలో బద్రి బుచ్చయ్య, ఆకుల లక్ష్మణ్, పొగాకు రమేష్, జక్కుల సాగర్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను సన్మానించిన జీఎం


క్రీడాకారులను సన్మానిస్తున్న జీఎం

మందమర్రి టౌన్, నవంబర్ 16(ఆంధ్రజ్యోతి): కోల్ ఇండియాలో సింగరేణి కార్మిక క్రీడాకారులు మరిన్ని పథకాలు సాధించి సింగరేణి సత్తా చాటాలని జీఎం దేవేందర్ తెలిపారు. గత సెప్టెంబర్‌లో కోల్ ఇండియాలో జరిగిన బాడీబిల్డింగ్ పోటీలో వర్కుషాపులో ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు గోల్డ్‌మెడల్, కాసిపేట గనిలో జనరల్‌మజ్దూర్‌గా పనిచేస్తున్న మనోహర్ బ్రాంజ్ మెడల్, క్లర్కుగా కాసిపేటలో పనిచేస్తున్న కావ్యశ్రీ పవర్‌లిఫ్టింగ్‌లో బ్రాంజ్ మెడల్ సాధంచగా శనివారం వారిని సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఈ ముగ్గురుని మిగతా క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పీఎం శ్యాంసుందర్, బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాతో ప్రమాద బీమా

శ్రీరాంపూర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాతో ప్రమాదబీమా పొందవచ్చని జీఎం(ఐఆర్‌అండ్‌పీఎం) కవితానాయుడు అన్నారు. శనివారం ఆమె జీఎం(సివిల్) సూర్యనారాయణతో కలిసి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టుఉద్యోగులు అందరూ తప్పనిసరిగా వారి బ్యాంకుఖాతాలను హెచ్‌డీఎఫ్‌సీలో తీసుకునేలా చూడాలని పర్సనల్‌అధికారులను ఆదేశించారు. కాంట్రాక్టు కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు బ్యాంకుద్వారా మృతుడి కుటుంబానికి బీమాడబ్బు అందుతుందని తెలిపారు. అలాగే ప్రమాదబీమా సౌకర్యం లేని సింగరేణిఉద్యోగులకు స్టేట్‌బ్యాంక్ ఆఫ్‌ఇండియా, యూనియన్‌బ్యాంక్ ఆఫ్‌ఇండియా, కెనరా బ్యాంకులలో ఖాతాలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు, డీజీఎం(సివిల్) ఆనంద్‌కుమార్, డిప్యూటీపర్సనల్ మేనేజర్ వి దేవేందర్‌రెడ్డి,సీనియర్ పీవోలు కాంతారావు, రణదీప్‌గౌడ్, సంతన్, పాల్‌సృజన్, సురేందర్, రమేష్ పాల్గొన్నారు.

అవగాహన లేకుండా ఆరోపణలు చేస్తున్న సీతారామయ్య

మందమర్రిటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ రాష్ట్రఅధ్యక్షుడు సీతారామయ్య తమ యూనియన్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఐఎన్‌టీయూసీ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు దేవిభూమయ్య ధ్వజమెత్తారు. శనివారం ఆయన మందమర్రిలో మాట్లాడుతూ సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని పదేపదే ఆరోపణలు చేస్తున్నారని ఇది సరైంది కాదన్నారు. గతకార్మిక సంఘం గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీబీజీకేఎస్‌తో లోపాయికారి ఒప్పందంచేసుకుని ఐఎన్‌టీయూసీనీ ఓడించేందుకు వారితో కలిసి పనిచేసింది వాస్తవం కాదా అన్నారు. ఇప్పుడు టీబీజీకేఎస్‌కు న్యాయం చేసేందుకు సీతారామయ్య ఆరాటపడుతుంది వాస్తవం కాదా అన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం లేదని పేర్కొన్నారు. సీతారామయ్య అవగాహన లేకుండా ఏదో మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. నాయకులు నరేందర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన అధికారులకు సన్మానం

శ్రీరాంపూర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): టీబీజీకేఎస్, సీఐటీయూ ఆధ్వర్యంలో ఇద్దరు అధికారులను శనివారం సన్మానించారు. ఎస్‌ఆర్పీ1,3గనుల గ్రూపు ఏజెంటుగా పనిచేసి పదోన్నతిపై ఆర్‌జీ-1 ఏరియా ఎస్‌వోటు జీఎంగా వెళ్తున్న గోపాల్‌సింగ్‌ను ఎస్‌ఆర్పీ1 గనిపై సన్మానించారు. ఆయన ఈ ఏరియాలో చేసిన సేవలను కొనియాడారు. అలాగే ఇందారం ఓసీపీలో మేనేజర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఎస్‌ఆర్పీ1,3గనుల గ్రూపు ఏజెంటుగా వచ్చిన వెంకటేశ్వర్లుకు ఘనస్వాగతం పలికి సన్మానించారు. ఆయా కార్యక్రమాలలో టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏరియాఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, సీఐటీయూ నాయకులు తోడే సుధాకర్, ప్రవీణ్, బాలకృష్ణ, సంపత్, గోపాల్‌సింగ్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

రెబ్బెన, నవంబరు 16: సింగరేణి స్కూల్ విద్యార్థులు పదవ తరగతిలో ఈ విద్యాసంవత్సరంలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ తెలిపారు. శనివారం గోలేటి సింగరేణి పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలన్నారు. అనంతరం వసతులపై వాకబు చేశారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ప్రధానోపాధ్యాయుడు రవితేజ పాల్గొన్నారు.

కోల్ ఇండియాకు ఎంపికైన డేవిడ్‌సన్ టీం

మంద మర్రి టౌన్, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): కోల్‌ఇండియాలో త్వరలో జరగనున్న కల్చరల్‌పోటీలకు ఆర్కెస్ట్రా విభాగంలో మందమర్రిఏరియాకు చెందిన డెవిడ్‌సన్ ఆర్కెస్ట్రాటీం ఎంపికైంది. ఈసారి తప్పకుండా కోల్‌ఇండియాలో ఆర్కెస్ట్రా విభాగంలో బహుమతి సాధిస్తామని తెలిపారు. ఈ టీములో 8సభ్యులుండగా 7మందమర్రి కార్మిక కళాకారులు కాగా ఒకరు బెల్లంపల్లి నుంచి ఎంపిక కావడం విశేషం.

బహుమతుల ప్రదానం

ఆర్కెస్ట్రా డేవిడ్‌సన్ టీంను శనివారం జీఎం కార్యాలయంలో మందమర్రి జీఎం దేవేందర్ అభినందించారు. బహుమతులు అందించారు. కార్యక్రమంలో పీఎం శ్యాంసుందర్, ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు తిరిగి ఇవ్వాలని బాధితుల నిరసన


దర్నా చేస్తున్న బాధితులు, నాయకులు

శ్రీరాంపూర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సీఆర్‌ఆర్ కంపెనీలో తమకు తిరిగి ఉద్యోగాలు ఇవ్వాలని మాజీ కాంట్రాక్టు కార్మికులు డిమాండ్ చేశారు. శనివారం వారు కంపెనీలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తాము కొన్నేళ్లుగా పనిచేస్తున్నప్పటికీ ఐదునెలల క్రితం అకారణంగా తొలగించారని తెలిపారు. అప్పటినుంచి ఉద్యోగాలు తిరిగి ఇవ్వాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న బీజేపీ నస్పూర్ పట్టణ ప్రధానకార్యదర్శి కుర్రె చక్రవర్తి తమ కార్యకర్తలతో కలిసి బాధితులకు మద్దతు తెలిపారు. బుధవారంలోగా సమస్య పరిష్కరిస్తామని సింగరేణి అధికారులు హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నస్పూర్ మండల అధ్యక్షుడు సత్రం రమేష్, మాజీఎంపీటీసీ సభ్యుడు అగ్గుమల్లేశ్, కార్మికులు పాల్గొన్నారు.

అధికారికి సన్మానం

శ్రీరాంపూర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏరియాలోనిఆర్కే5గని మేనేజర్‌గా పనిచేసి పదోన్నతిపై శాంతిఖనికి ఏజెంట్‌గా వెళ్తున్న అబ్దుల్‌ఖాదిర్‌ను సీసీసీలోని జామేమసీద్‌కమిటీ అధ్యక్షుడు మహ్మద్ మౌలానా ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. శాలువాలు, పూమాలలతో సత్కరించారు. అనంతరం అన్నదానంచేశారు. కార్యక్రమంలో మజీద్‌ఇమామ్ కమిటీసభ్యులు పాల్గొన్నారు.

రెండో విడుత నమోదుపైనే ఆశలు

5వ పేజీ తరువాయి

రెండో విడుతపైనే ఆశావహుల ఆశలు...

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు నమోదుకు సెప్టెంబరు 30 నుంచి నవంబరు 6 వరకు ఎలక్షన్ కమిషన్ గడువు విధించింది. ఊహించినంతగా ఓటరు నమోదు కాకపోవడంతో ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధపడుతున్న ఆశావహులు నిరుత్సాహానికి గురయ్యారు.

ఆశావహులే రంగంలోకి దిగి వారి పట్టభద్రులు సర్టిఫికెట్లు సేకరించి ఓటరు నమోదు చేశారు. ఎలక్షన్ కమిషన్ రెండో విడుత ఓటరు నమోదుకు అవకాశం కల్పించడంతో ఓటర్ల సంఖ్య మరో లక్షన్నర వరకు పెరిగే అవకాశాలున్నట్లు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రెండో విడుతలో భాగంగా ఈ నెల 23 నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు ఎలక్షన్ కమిషన్ తుది గడువు విధించింది.

ఊపందుకున్న ప్రచారం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా పట్టభద్రులు, ఉపాధ్యాయ మండలి ఎన్నికల ప్రచార సందడి పెరుగుతోంది. టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులు క్షేత్రస్థాయిలో ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. ఉపాధ్యాయ సంఘాల నుంచి పోటీ నెలకొనడంతో టీచర్లకు ఓటరు నమోదు తప్పనిసరి అయింది. అయినప్పటికీ ఉపాధ్యాయుల నుంచి స్పందన అంతంతే ఉంది.

తీరిన హాస్టల్ విద్యార్థుల నీటి గోస



బోర్‌వెల్ డ్రిల్లింగ్ పనులు పరిశీలిస్తున్న అధికారులు

నెన్నెల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ పథకంపై ఆధారపడి రెండేళ్లుగా నీటి సమస్యలు ఎదుర్కొంటున్న నెన్నెల ఎస్సీ హాస్టల్ విద్యార్థుల నీటి గోస తీరింది. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు శనివారం నూతన బోర్‌వెల్ వేశారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి పి. రవీందర్‌రెడ్డి బోర్‌వెల్ డ్రిల్లింగ్ పనులను ప్రారంభించారు. పాతబోరు పాడైపోవడంతో రెండేళ్లుగా నీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్నామని, కొత్త బోర్‌వెల్ ఏర్పాటుతో తమ సమస్య తీరిందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. బోర్ ఏర్పాటుకు కృషి చేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. బెల్లంపల్లి ఏఎస్‌డబ్ల్యూవో రవీందర్, నెన్నెల వార్డెన్ జయశంకర్ ఉన్నారు.

అనాథ ఆశ్రమానికి వృద్ధుడి తరలింపు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



వృద్ధుడిని తీసుకెళ్తున్న ప్రజా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

మందమర్రి టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అందరు ఉన్నా అనాథగా.. గెంటేసిన కుటుంబ సభ్యులు.. మూడు నెలలుగా షెడ్డు కింద జీవనం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్థానిక ప్రజా సేవ సొసైటీ సభ్యులు స్పందించారు. శనివారం తిరుపతిరెడ్డిని మంచిర్యాలలోని తొల్లవాగు వద్ద గల రెడ్ క్రాస్ సొసైటీ వృద్ధాశ్రమానికి తరలించారు.

సన్మానం

గర్మిళ్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆలిండియా కిసాన్ కాంగ్రెస్ వైస్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డిని శనివారం భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గుంటక సత్యనారాయణరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. రైతుల సమస్యలపై , రైతుకు అనుబంధంగా రావాల్సిన పరిశ్రమల గురించి చర్చించారు. క్షేత్రస్థాయిలో రైతులతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని కోదండరెడ్డి తెలిపారన్నారు.

రయ్..రయ్

ద్విచక్రవాహనాలపై యువత ఆసక్తి చూపుతోంది. ఒకప్పుడు లక్ష రూపాయల్లో బైక్ వచ్చేది. ప్రస్తుతం లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. ధరలో కారుతో సమానంగా ఉన్న స్పోర్ట్స్ బైక్‌లను కొనుగోలు చేస్తున్నారు. కొత్త ఫీచర్లు, స్పోర్ట్స్ బైక్‌లు కొనుగోలు చేస్తున్నారు...



- స్పోర్ట్స్ బైక్‌లపై యువత క్రేజ్...
- అందుబాటులో అధునాతన మోడళ్లు
- లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు

బెల్లంపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నేటి యువత బైక్‌లపై ఆసక్తి చూపుతోంది.. బైక్‌పై రయ్ రయ్‌మంటూ దూసుకుపోతున్నారు.. యువత ఎక్కువగా కొత్త ఫీచర్లు, స్పోర్ట్స్ మోడల్ బైక్‌లు కొనుగోలు చేయడానికి తహతహలాడుతున్నారు... యువత ఆసక్తికి అనుగుణంగా పలు కంపెనీలు బైక్‌లను అందుబాటులోకి తెస్తున్నాయి. యువత ఎక్కువగా కొనుగోలు చేస్తున్న బైక్‌లు లక్షల రూపాయల్లో ఉంటున్నాయి.

లక్షల్లోనే ధరలు

ఒకప్పుడు ద్విచక్ర వాహనం కొనాలన్నా లక్ష రూపాయల లోపే ఉండేది. ప్రస్తుతం వాటి ధర లక్షల్లో ఉంటుంది. యువత ముఖ్యంగా ఇంజన్ సీసీ ఎక్కువ ఉన్న బైక్‌లను కొనుగోలు చేస్తున్నారు. 150సీసీ కన్నా ఇంజన్ కెపాసిటీ ఉన్న ప్రీమియం బైక్‌లను కొనుగోలు చేస్తున్నారు. వీటి ధరలు రూ.3 లక్షల నుంచి 15 లక్షల వరకు ఉంటున్నాయి. లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేస్తున్న బైకులకు ఎక్స్‌ట్రా ఫిట్టింగ్ కోసం వేల రూపాయలను వెచ్చిస్తున్నారు. సైలెన్సర్‌లు మార్చడం, పెట్రోల్ ట్యాంకు చుట్టూ అదనపు భాగాలు, అడ్జస్ట బుల్ సీట్లు, ఆటోమేటిక్ లైట్లతో ఆకర్షణీయంగా తయారు చేసుకుంటున్నారు. వీటన్నంటికి అదనంగా డబ్బులు వెచ్చిస్తున్నారు.

అందుబాటులో అధునాతన మోడళ్లు

యువత బైక్‌లను కొనుగోలు చేస్తుండడంతో జిల్లాలో వివిధ బైక్‌ల షోరూంలు వెలుస్తున్నాయి. రాయల్ ఎన్‌ఫీల్డ్ (బుల్లెట్), హోండా, కేటీఎం, బజాజ్, యమహా వంటి షోరూం అందుబాటులోకి వచ్చాయి. స్పోర్ట్స్ బైక్‌లు తీసుకునే వారు హైద్రాబాద్‌కు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. వీటి ధర రూ. 5 లక్షల నుంచి 20 లక్షల లోపు ఉంటుంది. వీటిలో స్టైలిష్‌గా ఉన్న ప్రీమియం బైక్‌లను కొనేందుకు యువత ఆసక్తి చూపుతోంది. కొన్ని కంపెనీల వారు 650, 900 సీసీ ఇంజన్ సామర్థ్యం గల బైక్‌లను కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. దూర ప్రాంతాలకు యువత వందల కిలోమీటర్లు ద్విచక్ర వాహనాలపైనే వెళ్తున్నారు. ఏకంగా కొందరు యువకులైతే మార్కెట్‌లో ఎప్పటికప్పుడు వస్తున్న కొత్త బైక్‌లను కొనుగోలు చేస్తూ పాత బైక్‌లను అమ్ముతున్నారు.



స్టైలిష్ బైక్‌లు అంటే ఇష్టం

అజయ్, బెల్లంపల్లి



ప్రత్యేకంగా ఉన్న బైక్‌ను చూడడానికి చాలా మంది ఇష్టపడు తుంటారు. బైక్‌పై వెళ్తుంటే అందరి చూపే వారిపైనే ఉంటుంది. నేను రూ.4 లక్షలు పెట్టి బైక్ కొనుగోలు చేసి వాడుతున్నాను. ఇంజన్ సామర్థ్యంతో పాటు ప్రత్యేకమైన ఫీచర్లు ఉంటున్నాయి. ఇతర బైకులతో పోలిస్తే ప్రయాణం ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

రూ. 13 లక్షల పెట్టి కొన్నాను

పందిళ్ల వినయ్, శ్రీరాంపూర్,



చిన్నప్పటి నుంచి బైక్‌లంటే ఇష్టం. స్టైలిష్ స్పోర్ట్స్ బైక్ తీసుకోవాలని ఆలోచనతో రూ.13 లక్షలతో 900 సీసీ బైక్ కొన్నా. బైక్‌పై హైద్రాబాద్, ఇతర ప్రాంతాలకు వెళ్తాను. యూట్యూబ్‌లో ట్రావెల్ వ్లాగ్స్ చేస్తాను. అధునాతన బైక్ కావడంతో లాంగ్‌డ్రైవ్ వెళ్లినప్పటికీ అలిసిపోకుండా ఉండగలుగుతాను. కారు కంటే బైక్ చాలా సందర్భాల్లో సౌకర్యంగా ఉంటుంది.

యువత ఎక్కువగా ఆసక్తి

గాజుల మహేష్, బైక్ సేల్స్ మేనేజర్



బైక్ సేల్స్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నా. యువత బైక్‌లపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. లక్షల రూపాయలు వెచ్చించి బైక్‌లను కొనుగోలు చేస్తున్నారు. ఎక్కువగా ఇంజన్ సామర్థ్యం ఉన్న బైక్‌లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రీమియం బైక్ తీసుకోవాలంటే మూడు నెలల ముందే బుకింగ్ ...

న్యూస్ బాక్స్

మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

బెల్లంపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లిలో మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలలను ఏర్పాటు చేయాలని శనివారం ఎమ్మెల్యే వినోద్‌కు ఎంసీపీఐయూ నాయకులు వినతిపత్రం అందించారు. ఇటీవల రాష్ట్రంలో ప్రభుత్వం 8 మెడికల్ కళాశాలలను మంజూరు చేసినా, 9 పాలిటెక్నిక్ కళాశాలలను ఇంజనీరింగ్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నా బెల్లంపల్లికి చోటు దక్కలేదన్నారు. ఎన్నో ఏండ్లుగా విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజలు పోరాటాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరైంది కాదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మెడికల్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలన్నారు.

ఈ విషయంపై త్వర లోనే సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎంసీపీఐయూ జిల్లా కార్య దర్శి సబ్బని రాజేంద్ర ప్రసాద్, నాయ కులు పసులేటి వెంకటేష్ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

మందమర్రి టౌన్, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్, సొత్కు సుదర్శన్, పుల్లూరి లక్ష్మణ్, నెర్వెట్ల శ్రీనివాస్, కదారి జీవన్‌కుమార్, ఎండి హఫీజ్, పాల్గొన్నారు.

సోమేశ్వరాలయంలో రుద్రాభిషేకం

బెల్లంపల్లిరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చంద్రవెల్లి గ్రామంలోని అన్నపూర్ణ సహిత సోమేశ్వరస్వామి ఆలయంలో శనివారం కార్తీక మాసాన్ని పురస్కరించుకుని 108 లింగాలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం కార్యక్రమాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అచ్చలాపూర్ వేద పండితుడు గంగా కిశోర్‌శర్మ, కొమ్మెర మహాదేవ్‌శర్మల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గూడెం ఆలయ హుండీ లెక్కింపు

దండేపల్లి, (ఆంధ్రజ్యోతి): గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి జాతర సందర్భంగా రూ.35,12,224 ఆదాయం సమకూరినట్లు ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆలయంలో 58 రోజులకు సంబంధించిన హుండీని లెక్కించారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మదాయ శాఖ నిర్మల్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఎం రాజమౌళి, ఎస్సై ఉదయ్ కిరణ్, అర్చకులు గోవర్ధన రఘుస్వామి, సంపత్‌స్వామి, ఆలయ సిబ్బంది, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ కొనసాగింది. గోదావరి నదిలో పుణ్య స్నానాలు కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం ఆలయంలో భక్తులు కుటుంబ సమేతంగా సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.



పూజలు చేస్తున్న భక్తులు, గూడెంలో హుండీ లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

అథ్లెటిక్స్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

బెల్లంపల్లిరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఈ నెల 11 నుంచి 14 వరకు నిర్వహించిన పదవ జోనల్ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో బెల్లంపల్లిలోని కాసిపేట గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. అండర్ 14 విభాగంలో విద్యార్థులు 20 పతకాలతోపాటు చాంపియన్‌ట్రోఫీ సాధించినట్లు ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను శనివారం పాఠశాలలో అభినందించారు. పీడీ హరీష్, పీఈటీ రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

బెల్లంపల్లిరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని బెల్లంపల్లి తెలంగాణ గురుకుల సాంఘీక సంక్షేమ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ అన్నారు. శనివారం పాఠశాలలో సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక పోటీలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు మెదక్ జిల్లాలో జరిగే సబ్ జూనియర్ టోర్నమెంట్‌లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు వామన్, రాజశేఖర్, యాదగిరి, అఫ్రిన్, శివకుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

టైగర్ జోన్‌లో విద్యార్థుల సందడి



టైగర్ జోన్‌లో విద్యార్థులు

జన్నారం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ టైగర్ జోన్‌లో విద్యార్థులు సందడి చేశారు. కరీంనగర్‌కు చెందిన ఐవీ ప్రైవేటు స్కూల్‌కు చెందిన 135 మంది విద్యార్థులు శనివారం కవ్వాల టైగర్ జోన్‌లో పర్యటించారు. జన్నారం రేంజ్‌లోని బైసన్‌కుంట, గోండుగూడ బీట్‌లో పర్యటించి అక్కడున్న నీటి కుంటలు, గ్రాస్ ల్యాండ్‌లను తిలకించారు. సఫారి వాహనం ద్వారా రేంజ్ మొత్తంలో కలియతిరిగారు. ఎఫ్ఆర్‌వో సుష్మారావు, డీఆర్‌వో తిరుపతి, ఎఫ్‌బీవోలు లాల్‌బాయి, తన్వీర్, పాషా, మధుకర్ ఉన్నారు.

ఆహ్లాదం కనుమరుగు...

- బ్రిడ్జి కింద పార్కు మాయం
- రూ.25లక్షల ప్రజాధనం వృథా
- మళ్లీ వెలిసిన అక్రమ ఆవాసాలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

మంచిర్యాల అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలో రైల్వే బ్రిడ్జి కింద ఏర్పాటు చేసిన పార్క్ క్రమంగా కనుమరుగైంది. పట్టణ వాసులకు ఆహ్లాదాన్ని అందించేందుకు పలు చోట్ల సుందరీకరణ పనులను చేపట్టారు. అందులో భాగంగా 2021లో ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద నిరాశ్రయులు ఏర్పాటు చేసుకున్న అక్రమ ఆవాసాలను తొలగించారు. అనంతరం పట్టణ ప్రగతి నిధులు రూ.25 లక్షలతో బ్రిడ్జి పిల్లర్ల కింద గోడలు నిర్మించి మట్టి నింపి, గడ్డి పరిచి రంగురంగుల పూల మొక్కలను నాటి మినీ పార్కులను ఏర్పాటు చేశారు. బ్రిడ్జి పిల్లర్లకు అందంగా వాల్ పేయింటింగ్ వేయించారు. పార్కులో వృక్షాల కొమ్మలపై వాలిన పక్షులు, కోతుల బొమ్మలను ఏర్పాటు చేసి రాత్రుల్లో ఆకర్షణగా ఉండేందుకు ఎల్ఈడీ లైట్లను అమర్చారు. ఎంతో సుందరంగా తయారు చేసినప్పటికీ ఆరంభం నుంచి దాని నిర్వహణపై మున్సిపల్ అధికారులు శ్రద్ధ కనబర్చలేదు. దీంతో ప్రస్తుతం ఆ పార్కు ఆనవాళ్ల కూడా లేకుండాపోయింది. నాటిన మొక్కలు ఎండిపోయాయి. గడ్డి తొలగిపోయి మట్టి తేలింది. ఇక బొమ్మల విషయానికి వస్తే వాటి జాడ కనిపించకుండాపోయింది. రూ.25 లక్షల ప్రజాధనం వృథా అయింది. ఆ ప్రాంతమంతా కళావిహీనంగా మారడంతో పాటు పార్కు స్థలం పరులపాలైంది. మళ్లీ అక్రమ ఆవాసాలు వెలిశాయి. అదే పార్కు స్థలాల్లో కొందరు నిరాశ్రయులు గుడిసెలను, డేరాలను వేసుకొని జీవనం సాగిస్తున్నారు. దీంతో కథ మళ్లీ మొదటికే వచ్చింది. లక్షలు వెచ్చించి నిర్మించిన పార్కులు మాయమైనా, అదే ప్రాంతంలో మళ్లీ అక్రమ ఆవాసాలు వెలసినా సంబంధిత మున్సిపల్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.





కళావిహీనంగా మారిన పార్కు, మళ్లీ వెలిసిన అక్రమ ఆవాసాలు

ఆవాసాలను తొలగిస్తాం

మారుతీ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్

ఓవర్ బ్రిడ్జి కింద గల పార్కుల్లో అక్రమ ఆవాసాలు వెలిసిన విషయం దృష్టికి రాలేదు. అక్రమంగా ఏర్పాటు చేసుకొన్న ఆవాసాలను తొలగిస్తాం. పార్కును పరిరక్షించడంతో పాటు మళ్లీ అక్కడ అక్రమణలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

హక్కుల సాధన కోసం కలిసికట్టుగా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

దండేపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): హక్కుల సాధన ధ్యేయంగా కలిసికట్టుగా పని పని చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శనిగారపు మురళీకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతూ ఆదివారం మండల కార్యవర్గాన్ని ఎన్నుకుంటామన్నారు. జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమయ్య కమిటీని నియమిస్తారన్నారు. కోల్లూరి రవికుమార్, బచ్చల అంజన్న, లింగంపల్లి బాపు, కోంగల నవీన్, ఆవుల గంగయ్య, ఆరేపల్లి రమేష్, పాల్గొన్నారు.

వరి కోతల్లో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



రైతులకు సూచనలు చేస్తున్న ఏఈవో

నెన్నెల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన ధాన్యం దిగుబడికి రైతులు వరి కోతల్లో జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈవో రామ్‌చందర్ అన్నారు. నెన్నెల, ఖర్జి గ్రామాల రైతులకు శనివారం కోతలపై అవగాహన కల్పించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే ప్రభుత్వం మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. పొలం మొత్తం ఎండిన తర్వాతనే కోయాలన్నారు. తేమ శాతం 17కు తక్కువ ఉండేలా చూసుకోవాలన్నారు. కళ్లంలోనే ఆరబెట్టి, తాలు, తప్ప లేని ధాన్యాన్ని సెంటర్‌కు తీసుకురావాలని సూచించారు.

అటవీ ప్రాంతాన్ని పరిశీలించిన ఫారెస్టు అధికారులు

మందమర్రిరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకర్‌పల్లి గ్రామంలోని అటవీ ప్రాంతంలో, కేకే 5 గని సమీపంలో శుక్రవారం రాత్రి పత్తి ఏరే కూలీలు కుక్కను చూసి పులి అనుకుని కేకలు వేయడం వైరల్‌గా మారింది. సమాచారం అందుకున్న ఫారెస్టు అధికారులు శనివారం ఉదయం అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. వారు పులి కాదు కుక్క అని నిర్ధారించారు. ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ రత్నాకర్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సంతోష్, బీట్ అధికారి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



మంచిర్యాల

జిల్లా వార్తలు

ఆదివారం 17 నవంబరు 2024

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించిన కలెక్టర్



సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను కలెక్టర్ కుమార్ దీపక్ శనివారం పరిశీలించారు. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని 3, 9, 15 వార్డుల్లో జరుగుతున్న సర్వేను తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ సర్వేలో ప్రతీ అంశాన్ని పూరించాలని సిబ్బందికి సూచించారు. ఎన్యుమరేటర్లు అన్ని వివరాలను పొరపాట్లు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలన్నారు. సర్వే నిర్వహించే ప్రాంతంలో ముందు రోజు సంబంధిత కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వాలని, ఇంటి యజమానులు అవసరమైన పత్రాలతో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సర్వేను పరిశీలించిన ఎంపీడీవో

మందమర్రిరూరల్, (ఆంధ్రజ్యోతి): అందుగులపేట, పులిమడుగు, బొక్కల గుట్ట గ్రామాల్లో జరుగుతున్న ఇంటింటి కుటుంబ సర్వేను శనివారం ఎంపీడీవో రాజేశ్వర్ పరిశీలించారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతీ ఇంటికి వెళ్లి వివరాలు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం నర్సరీలను పరిశీలించారు. మొక్కలను సంరక్షించాలని సి



రెండో విడత నమోదుపైనే

ఆశలు

- ఎమ్మెల్సీ ఎన్నికలకు స్పందన అంతంతే...!
- గడువు ముగిసే సరికి 4 లక్షల లోపే దరఖాస్తులు
- ఆసక్తి చూపని పట్టభద్రులు
- టీచర్ ఎమ్మెల్సీ కోటాలో తగ్గిన నమోదు

మంచిర్యాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటరు నమోదు ప్రక్రియ ఆశించిన మేర జరగలేదు. ఎలక్షన్ కమిషన్ రెండో విడత ఓటరు నమోదుకు అవకాశం ఇచ్చింది. దీంతో బరిలో నిలచే ఆశావహులు ఓటరు నమోదుపై ఆశలు పెంచుకున్నారు.

ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ ఉమ్మడి జిల్లాల పరిధిలో సుమారు 8 లక్షల వరకు గ్రాడ్యుయేట్లు ఉంటారని అంచనా వేయగా, అందులో 50 శాతం మేర కూడా ఓటరు నమోదు కాలేదు. టీచర్ల ఓటరు నమోదులో కూడా అంతంత మాత్రంగానే ఉంది. నాలుగు ఉమ్మడి జిల్లాల్లోని 42 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు 300 మండలాలకు సంబంధించి ప్రస్తుతం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీకి చెందిన జీవన్‌రెడ్డి, టీచర్ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూకు చెందిన రఘోత్తంరెడ్డిలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరి పదవీ కాలం ఫిబ్రవరిలో ముగియనుండగా సెప్టెంబరు 30 నుంచి నవంబరు 6వ తేదీ వరకు ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగింది.

నాలుగో స్థానంలో మంచిర్యాల జిల్లా....

ఓటరు నమోదు ప్రక్రియలో రాష్ట్రంలోనే మంచిర్యాల జిల్లా నాలుగో స్థానంలో ఉంది. 30వేల పై చిలుకు ఓటరు నమోదులో మొదటి స్థానంలో కరీంనగర్ ఉండగా, ద్వితీయ స్థానంలో జగిత్యాల, తృతీయ స్థానంలో సిద్దిపేట, నాలుగో స్థానంలో మంచిర్యాల జిల్లాలు ఉన్నాయి. మంచిర్యాల జిల్లాలో గత ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా 15వేల మంది ఓటరుగా నమోదు చేసుకోగా, ఈసారి 30 వేల పైచిలుకు మంది దరఖాస్తు చేసుకొన్నారు. జిల్లాలో ముఖ్యంగా యువత నుంచి మంచి స్పందన లభించింది.

మిగతా 7వ పేజీలో

గ్రూప్ 3 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లాలో 48 పరీక్ష కేంద్రాలు



డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న పరీక్ష నోడల్ అధికారి మోతిలాల్

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం గ్రూప్ 3 పరీక్షకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 48 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 15,038 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారు. ప్రతీ పరీక్ష కేంద్రానికి ముఖ్య పర్యవేక్షకులు, రూట్, జాయింట్ రూట్ అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. వైద్య, పోలీసు సిబ్బందిని నియమించారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పేపర్ 1, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పేపర్ 2, సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్ 3 పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్‌తోపాటు ఫొటో గుర్తింపు కార్డు తీసుకురావాలని అధికారులు సూచించారు. పరీక్ష నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, పోలీసు నోడల్ అధికారిగా బెల్లంపల్లి ఏఆర్ ఏసీపీ సుందర్, రీజియన్ కో ఆర్డినేటర్‌గా నరేందర్‌రెడ్డిలను నియమించారు. పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని కలెక్టర్ కుమార్‌దీపక్ తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, అభ్యర్థులు ఉదయం 8.30 గంటల మధ్యాహ్నం 2 గంటల లోపు పరీక్ష కేంద్రాలకు రావాలని సూచించారు. అరగంట ముందు గేట్లు మూసివేస్తారని పేర్కొన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఒరిజనల్ గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రికల్ వస్తువులు అనుమతించరని తెలిపారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

జిల్లా కేంద్రంలోని గ్రూప్ 3 పరీక్ష కేంద్రాలను పరీక్షల నోడల్ అధికారి, అదనపు కలెక్టర్ మోతిలాల్ శనివారం పరిశీలించారు. వసతుల గురించి ఆరా తీశారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.

హాజీపూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపల్లిలో గల ఎస్ఆర్ఆర్ జూనియర్ కళాశాల గ్రూప్ 3 పరీక్ష కేంద్రాన్ని ఆర్డీవో శ్రీనివాసరావు పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన వసతుల గురించి చీఫ్ సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అభ్యర్థులకు తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. తహసీల్దార్ శ్రీనివాస రావుదేశ్ పాండే, ఎస్ఐ గోపతి సురేష్ ఉన్నారు.

గ్రూప్-3 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్



మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాల అర్బన్, (ఆంధ్రజ్యోతి): గ్రూప్-3 రాత పరీక్షల నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల సబ్ డివిజన్ పరిధిలో 38, బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలో 10, మొత్తం 48 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు 163 బీఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్‌నెట్ సెంటర్లు మూసివేయాలని, లౌడ్ స్పీకర్లను నిలిపివేయాలని, 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడవద్దని సూచించారు. అభ్యర్థులు సమయానికే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, సెల్‌ఫోన్లు, ట్యాబ్, పెన్‌డ్రైవ్, బ్లూటూత్, ఎలక్ట్రానిక్ వాచ్, క్యాలిక్యులేటర్లు, వాలెట్ అనుమతించమని ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రంలోకి వెళ్లేముందు ప్రధాన గేటు వద్ద తనిఖీలు నిర్వహించే పోలీసులకు అభ్యర్థులు సహకరించాలని డీసీపీ తెలిపారు.

క్రిటికల్ కేర్ ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన



క్రిటికల్ కేర్ ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

గర్మిళ్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల గోదావరి రోడ్డు లోని మెడికల్ కాలేజీ ప్రాంగణంలో రూ. 23.75 కోట్ల వ్యయంతో క్రిటికల్ కేర్ ఆసుపత్రి నిర్మాణానికి ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు శనివారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచిర్యాల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి క్రిటికల్ కేర్ ఆసుపత్రి నిర్మిస్తున్నట్లు తెలిపారు. 50 పడకల సామర్థ్యం గల ఆసుపత్రిలో ఎమర్జెన్సీ కేసులకు పరీక్షలు చేస్తారన్నారు. మంచిర్యాలను మెడికల్ హబ్‌గా మారుస్తామన్న హామీని అమలు చేస్తామని, ఈ నెల 21న పనులు ప్రారంభమవుతాయన్నారు. మంత్రులు దామోదర రాజనర్సింహా, దుద్దిళ్ల శ్రీధర్‌బాబులు హాజరవుతారని తెలిపారు. రెండున్నరేళ్లలో ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేసి విపక్షల విమర్శలకు తాళం వేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్, జీజీహెచ్ ఆసుపత్రి సూపరింటెండెంట్ హరీష్‌చంద్రరెడ్డి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సులేమాన్, వైస్ ప్రిన్సిపాల్ రేఖ, మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేష్, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, పట్టణాధ్యక్షుడు తూముల నరేష్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

నర్సింగ్ కాలేజీ పనులు ప్రారంభం

మంచిర్యాల సాయికుంటలో రూ.40 కోట్లతో నర్సింగ్ కాలేజీ నిర్మాణ పనులను శనివారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేం సాగర్‌రావు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచిర్యాల మెడికల్ కాలేజీకి అనుబంధంగా నర్సింగ్ కాలేజీ నిర్మిస్తున్నామన్నారు. ప్రస్తుతం మార్కెట్ యార్డులో మెడికల్ కాలేజీ పక్కన నర్సింగ్ కాలేజీ నిర్వహిస్తున్నామన్నారు. సొంత భవనం నిర్మాణంతో సౌకర్యాలు ఉంటాయని తెలిపారు. నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ సుజాత, మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేష్, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు తూముల నరేష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

మంచిర్యాల అర్బన్, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సాయికుంటలో గల గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాలను శనివారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేం సాగర్‌రావు సందర్శించారు. ఇటీవల ఆహారం వికటించి అస్వస్థతకు గురై కోలుకున్న విద్యార్థినులతో మాట్లాడి వారి క్షేమసమాచారాన్ని తెలుసుకున్నారు. విద్యార్థినుల కోరిక మేరకు రూ.50వేల విలువ గల స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, గిన్నెలను విరాళంగా అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల భోజనం విషయంలో రాజీ వద్దన్నారు. వారికి రుచికరమైన, పౌష్టికాహారాన్ని అందిస్తామన్నారు. ప్రభుత్వం ఆ దిశగా ఆశ్రమ పాఠశాలల్లో విద్య నభ్యసించే విద్యార్థుల మెస్ చార్జీలను పెంచిందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేష్, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సుర్మిల్ల వేణు, నాయకులు చిట్ల సత్యనారాయణ, తూముల నరేష్ ఉన్నారు.

వైకుంఠధామం పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

జిల్లా కేంద్రంలోని గోదావరి నదీ తీరంలో రూ.4కోట్లతో నిర్మిస్తున్న వైకుంఠధామం నిర్మాణ పనులను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పయ్యావుల ముని, ఎంఈ మసూద్ అలీ, ఏఈ రాజేందర్, నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

హాజీపూర్, (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు. శనివారం ముల్కల్లలోని గోదావరి వద్ద ఇసుక రీచ్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అవసరాల నిమిత్తం ఇసుక రీచ్‌ను ప్రారంభిస్తామన్నారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవడం ద్వారా పారదర్శకంగా ఇసుకను అందిస్తామన్నారు. ఎవరైనా ఇసుక రీచ్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మైనింగ్ ఏడీ జగన్, డీపీవో వెంకటేశ్వర్‌రావు, ఆర్డీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్ పాండే, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



ఆశ్రమ పాఠశాల విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ



ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

దండేపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా గతేడాది చేపట్టిన ఉపాధిహామీ పనులపై మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. డీఆర్‌డీవో కిషన్ పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో తనిఖీ బృందాలు సందర్శించి పనులను తనిఖీ చేపట్టారన్నారు. మండలంలోని ఈజీఎస్ పథకం ద్వారా రూ 2 కోట్ల 54లక్షల 7,602 విలువైన అభివృద్ధి పనులు చేపట్టాగా, అందులో కూలీలకు 2కోట్ల 50లక్షల 82, 371, సామగ్రికి రూ. 3లక్షల 25వేల231 ఖర్చు చేసినట్లు తనిఖీ బృందం సభ్యులు వివరించారు. ఇందులో రూ.6,507 మేర అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. కర్ణపేట జీపీకి రూ. 5వేల జరిమానా విధించారు. లక్షెట్టి పేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్‌చందు, మండల ప్రత్యేకాధికారి రవీందర్ రెడ్డి, ఎంపీడీవో ప్రసాద్, ఎస్ఆర్‌పీ దేవేందర్, అంబుడ్స్ మెన్ శివరాం, ఎంపీవో విజయప్రసాద్, ఈజీఎస్ ఏపీవో దుర్గదాస్, కార్యదర్శులు పాల్గొన్నారు.

కరెంటు తీగలు తగిలి వ్యాన్ దగ్ధం



దగ్ధమవుతున్న వ్యాన్

జన్నారం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలం లోని కామన్‌పల్లి శివారు గుడివాగు సమీపంలో శనివారం విద్యుత్ తీగలు తగిలి వ్యాన్ దగ్ధమైంది. జన్నారంలోని బట్టి రవికి చెందిన వ్యాన్ వరిగడ్డితో వెళ్తుండగా ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ వైర్లు తగలడంతో మంటలు వ్యాపించాయి. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా వారు వచ్చేలోగా వ్యాన్ దగ్ధమైందని గ్రామస్తులు తెలిపారు.

స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వినోద్‌వెంకటస్వామి, కలెక్టర్ కుమార్ దీపక్

కాసిపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళలు కుట్టు శిక్షణలో నైపుణ్యం పొంది స్వయం ఉపాధి ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం దేవాపూర్ పంచాయతీ ఆవరణలో జిల్లా వయోజన విద్యాశాఖ లయన్స్‌క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి, స్త్రీశక్తి లయన్స్‌క్లబ్ దేవాపూర్, ఓరియంట్ గోల్డ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ అక్షరాభ్యాస కేంద్రాలను ఎమ్మెల్యే గడ్డం వినోద్‌తో కలిసి కలెక్టర్ సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ అక్షరాసత్య కుట్టు శిక్షణ కేంద్రం ద్వారా మహిళలు శిక్షణలో తర్ఫీదు పొందుతూ నిరక్షరాస్యులైన వయోజనులకు చదువు నేర్పిస్తున్నారన్నారు. కుట్టు శిక్షణ నైపుణ్యం పొందిన మహిళలు స్వయం ఉపాధి పొందేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. అక్షరాభాస్య కేంద్రాల ద్వారా నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంలో రాష్ట్రంలోనే కాసిపేట మండలం ముందంజలో ఉండడంపై అభినందించారు. వంద రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువీకరణ పత్రాలు అందించారు. జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, లీడ్ బ్యాంకు డిస్టిక్ మేనేజర్ తిరుపతి, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ దుర్గా ప్రసాద్, ఓరియంట్ సిమెంట్ కంపెనీ జీఎం కులకర్ణి, తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో సత్యనారాయణసింగ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి అన్నారు. శనివారం దేవాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో 32 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు కావస్తుందని, ఈ కాలంలో ప్రజా, రైతులు, మహిళల కోసం కృషి చేసిందన్నారు. రైతుల కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్, తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో సత్యనారాయణసింగ్, మాజీ ఎంపీటీసీ మేరుగు పద్మశంకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, గుండ శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శనివారం వంద పడకల ఏరియా ఆసుపత్రిలో ఎమ్మెల్యే కుమార్తె గడ్డం వర్ష ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తామని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రత్యేక వైద్య బృందాలను తీసుకువచ్చి బీపీ, షుగర్, కంటి, ఇతర వైద్య పరీక్షలు నిర్వహిస్తామని, ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. కంటి పరీక్షల్లో సమస్య ఎక్కువగా ఉన్న వారికి అద్దాలు అందిస్తామన్నారు. ఆపరేషన్‌లను కూడా ఉచితంగా జరిపిస్తామని పేర్కొన్నారు. అనంతరం శిబిరానికి వచ్చిన వారికి భోజనాలను ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, నెన్నెల మాజీ ఎంపీటీసీ హరీష్‌గౌడ్, ఆర్డీవో హరికృష్ణ, నాయకులు బండి ప్రభాకర్, నాతరి స్వామి పాల్గొన్నారు.